# వసంత రాగిణి


సుగుణ

''డాక్టర్ రాగిణీ''

తలెత్తి చూసాను. డాక్టర్ మనీషా నాయుడు.

''మన హాస్పిటల్ తరపునుంచి 'మ్యూజికల్ నైట్' నిర్వహిస్తున్నాం. అందరూ డాక్టర్లే పాడుతారు. అందరికీ పిలుపులు వెళ్లాయి. ఎంతో వుత్సాహంగా ముందుకొచ్చారు. ఓల్డ్ హిందీ సినిమా పాటలకి పరిమితం చేసాం నేను కన్వీనర్ కమ్ కంపేర్‌ని''

''చాలా మంచి ఆలోచన, డాక్టర్లకి ఇటువంటి మార్పు ఎంతో వుల్లాసం కలిగిస్తుంది. రోగులని చూసుకోవడంలో మనకెంత అంకిత భావమున్నా విరామం కూడా కోరుకుంటుంది మనసు. గుడ్ అయిడియా. ఇంతకీ నాతో ఏంపని పడింది? ప్రోగ్రాంకి వస్తానులే. పాత హిందీ సినిమా పాటలంటే నాకు పిచ్చి. విరాళం ఏమన్నా కావాలా?'' అన్నాను.



''వద్దు మేడమ్! డాక్టర్లు వాళ్ళే స్పాన్సర్లని తెచ్చుకుంటున్నారు. వీ హేవ్ ఏంపిల్ ఫండ్స్. కొన్ని ఎవార్డులున్నాయి. వాటిని సరైన పద్ధతిలో ఇవ్వడానికి న్యాయ నిర్ణేతగా మీరు రావాలి'' అంది మనీషా.

''మన హాస్పిటల్లోనేగా ఫంక్షను?''

''అవును మేడం, కొత్త బిల్డింగ్ కట్టే గ్రౌండ్స్‌లో వస్తారుగా?'' అంది.

''అలాగే వస్తా'' అన్నాను.

మనీషా వెళ్ళిపోయాక కొద్దిసేపు పాత హిందీ సినిమా పాటలు గుర్తుకి తెచ్చుకున్నాను. ఈ జెనరేషన్‌కి అయిదేళ్ల క్రితం పాటలు 'ఓల్డ్' అయిపోతాయి. మేం చిన్నప్పుడు పాడిన పాటలేం తెలుస్తాయి? ఇలా ఆలోచిస్తూండగా ఓ పాట మనసులో మెదిలింది. 'మురళీ బైరన్ భయీ' పాటతోపాటు మురళి వాయిస్తున్న రాధాకృష్ణ కూడా కళ్ళముందు కదిలాడు.

***

''మొదటి బహుమతి–ఆజారే పర్‌దేశీ–గానం వి.వి. రాధాకృష్ణ

రెండవ బహుమతి – భోల్‌రే కట్ పుత్‌లీ – గానం – వసంత

మూడవ బహుమతి – మురళీ బైరన్ భయీ – గానం – రాగిణి''

ప్రిన్స్‌పల్ గారు ప్రైజులందిస్తూ నా వంక మెచ్చుకోలుగా చూసారు.

''ఇన్ని ప్రైజులు కొట్టేసావే'' అన్నారు తర్వాత హాల్లో.

''ఫస్ట్‌ప్రైజ్ కాదుగా'' అన్నాను బుంగమూతి పెట్టి.

''రెండవ బహుమతీ, మూడవదీకూడా గెల్చుకుని, ఎలా అంటోందో చూడండి. అసలు రెండు పేర్లతో పాడ్డానికి పర్మిషనెలా ఇచ్చారండీ?'' అన్నాడు రాధాకృష్ణ.

''నువ్వూ రెండు పేర్లివ్వలేక పోయావా? రాధనీ, కృష్ణనీ, ఏ పేరైనా పాడేది లతామంగేష్కర్ గొంతేగా'' అన్నాను కవ్వింపుగా.

''లతామంగేష్కర్ పాటలంటే నా కిష్టం వసంతా. పాడుతుంటే అందులో స్వరం కలిసిపోతుంది. తన్మయత్వం వచ్చేస్తుంది. పద. ఇంట్లో నాన్నగారు ఎదురు చూస్తూ వుంటారు. ప్రైజులు చూపిద్దాం'' అన్నాడు రాధాకృష్ణ. ఇద్దరం ప్రిన్స్‌పల్ గారి పాదాలకి నమస్కరించి ఇంటి ముఖంగా బయలు దేరాం. పైకి ఎంత గునిసినా లోపల్లోపల కృష్ణకి ఫస్ట్ ప్రైజు వచ్చినందుకు నాకు కలిగిన సంతోషం అంతా ఇంతా కాదు. స్కూలు పక్క వీధిలోనే మా యిళ్ళు. వీధి మొదట్లో వాళ్ళిల్లు, చివర్నమాది. వీధి మొదట్లోకి రాగానే, రాధాకృష్ణ చెయ్యిపట్టుకుని గుంజాను.

''ఏమిటి వసంతా?'' అన్నాడు.

''ముందు మా యింటికెళ్ళి, మా నాన్నగారికి ప్రైజులు చూపించి తర్వాత మీ ఇంటికెళ్దాం. నేను పెద్దదాన్నమ్మా. నా మాట వినాలి'' అన్నాను బుజ్జగింపూ, అధికారం రెండూ జోడించి.

''నీ మాట నేనెప్పుడు కాదన్నాను? పద'' అన్నాడు.

నాన్నగారు పడక్కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటున్నారు. మమ్మల్ని చూసి ''ఏదిరా నీ ప్రైజు?'' అన్నారు రాధాకృష్ణతో.

''నాకేం రాలేదు. అన్నీ వసంతకే'' అన్నాడు రాధాకృష్ణ.

కప్పులన్నీ నా చేతిసంచిలో వున్నాయి. నాన్నగారు మురిపెంగా రాధాకృష్ణని దగ్గరకు తీసుకుని ''నమ్మమంటావా? ఏ పాట పాడావు?'' అన్నారు.

''ఆ జారే, ఇంకోపాటొస్తే కదా'' అన్నాను సంచిలోంచి కప్పులు తీస్తూ.

''వాడికి రానిపాటుంటుందే, వసంతరాగిణీ ఇదేమిటి? మూడు కప్పులున్నాయి?'' అన్నారు నాన్నగారు ఆశ్చర్యంగా.

''నాకు ఫస్టూ, థర్డూ, రాధాకృష్ణకి సెకండూ'' అన్నాను.

''సర్లే నీ సంగతి నాకెందుకు తెలియదూ రాధాకృష్ణతో పాటలో నువ్వెప్పుడు గెల్చావని? అసలు విషయం చెప్పండి'' అన్నారు నాన్నగారు.

''ఫస్ట్ నాకేవచ్చింది డాక్టరు నాన్నగారూ. వసంతకి సెకండూ, రాగిణికి థర్డూనూ'' వివరించాడు రాధాకృష్ణ.

''అయితే రెండు పేర్లు ఇచ్చావన్నమాట. అలా చేయడం తప్పుకదూ'' అన్నారు నాన్నగారు మందలింపుగా.

''ఒకటి కొట్టేస్తారనుకున్నాను. రెండు పేర్లూ పిల్చేసారు. పాడేసాను ప్రైజు లొచ్చాయి. ఖతమ్'' అన్నాను.

''సర్లెండి పేషంట్లొచ్చేవేళయింది. వెళ్ళి మీ ఆటలూ, పాటలూ చూసుకోండి'' అని నాన్నగారు క్లినిక్‌లోకి వెళ్ళిపోయారు. ఇద్దరం రాధాకృష్ణ ఇంటికేసి పరిగెట్టాం.

శ్రీరామచంద్రమూర్తిగారు మా ప్రైజులు చూసి ఎంతో ఆనందపడ్డారు. ''జయంతి ఉండుంటే ఎంతో గర్వపడేదిరా, కృష్ణా'' అన్నారు, కంటి కొసనున్న నీటి చుక్కని గోటితో తుడుచుకుని.

రాధాకృష్ణ మురళి వాయించేవాడు. మురళి పెదవులకాన్చి, అరమోడ్పుకనులతో స్వరాలు పలికిస్తూ వుంటే బృందావనంలో వున్న అనుభూతి కలిగేది. ఏవేవో రాగాలు వాయించి నన్నింకో లోకానికి తీసుకెళ్లేవాడు. ఆ మైమరుపు నుంచి మామూలు పరిసరాల్లోకి రాలేకపోయేదాన్ని. ఒకరోజయితే,''నీ మురళిలో లీనమయి నిన్నే మర్చిపోతున్నాను కృష్ణా'' అన్నాను. అప్పుడు నేర్పాడు 'మురళీ బైరన్ భయీ' అనేపాట. నేను హిందీ పదాలు సరిగా పలకలేకపోతే సరిచేసేవాడు.

రాధాకృష్ణ పుట్టిన మూడో నెలకే తల్లి మరణించింది. కొన్నాళ్ళు బంధువులు ఆదుకున్నా, ఎనిమిది నెలలొచ్చేసరికి శ్రీరామచంద్రమూర్తిగారు తిరిగిపెళ్ళి చేసుకున్నారు. వధువు జయంతి తండ్రి ఆర్మీ ఆఫీసరు. నార్త్ లోనే ఎక్కువకాలం వుండడంతో జయంతమ్మకి హిందీ భాష పట్టుబడింది. అలహాబాద్‌లో వున్న రెండు సంవత్సరాలు అక్కడి గురువు వద్ద హిందుస్తానీ గాత్ర సంగీతం నేర్చుకుంది. ఆ స్వరంలోని మాధుర్యానికి పరవశించిపోయి, గురువు 'జయ్ జయ్ వంతి' అది రాగంపేరుతో పిలిచేవారు. తండ్రి ఆకస్మిక మరణంతో జయంతమ్మ తల్లితో స్వగ్రామం తిరిగి వచ్చేసింది. వ్యవసాయం చూసుకుంటూ అక్కడే వుంటూండగా శ్రీరామచంద్రమూర్తిగారి సంగతి విని, వివాహం చేసుకుంటానని తనే ముందుకొచ్చింది. ఏ ప్రేరణో అనుకున్నారంతా. చంటిపిల్లవాడిని కంటిపాపలా సాకింది. రాధాకృష్ణ ఏడాదిన్నరకే 'అమ్మ' పక్కన కూర్చుని రాగాలాపన చేసేవాడు. మూడేళ్ళు వచ్చేసరికి భజన్స్ పాడేవాడు.



## ఎడిటర్ వాసంతి చమత్కారం

నటి వాసంతి ఆరోజుల్లో చదువుకున్న అతి కొద్దిమంది తారల్లో ఒకరు. వాసంతి బి.ఎ. చదివింది. అరవైల్లో పణక్కార కుటుంబం అన్న తమిళ చిత్రాన్ని తెలుగులోకి అనువదించింది. అది బాగా ఆడింది. తరువాత తెలుగులో వచ్చిన చిక్కడు దొరకడు, కదలడు వదలడు, గండికోట రహస్యం, అగ్గివీరుడు వంటి చాలా సినిమాలను తమిళంలో అనువదించి విడుదల చేసింది. అవన్నీ అక్కడ బాగా ఆడాయి. వాసంతి డబ్ చేసిన సినిమాకు మద్రాసులో మంచి మార్కెట్ వుండేదా రోజుల్లో. ఒరిజినల్ సినిమాలో ఎక్కడన్నా కథ నసగా సాగినట్టు అనిపిస్తే నిర్దాక్షిణ్యంగా వందల అడుగులు కత్తిరించేసేది. ఆవిడ చేసిన ఈ ట్రిమ్మింగ్ వల్ల సినిమా చాలా బాగా వచ్చేది. తను పదహారణాల తెలుగు పిల్ల. తెలుగులో నటిగా మాత్రం నిలదొక్కుకోలేకపోయింది. అందుకని నిర్మాతగా మారి భలేపాప అనే సినిమా తీసింది. బాగానే ఆడింది. భలేపాప సినిమాకు తమిళంలో వచ్చిన కన్నిపాప ఆధారం. ఈ కన్నిపాపకు హిందీలో వచ్చిన ఆంసూ ఔర్ ముస్కాన్ ఆధారం.

తెలియని వాళ్ళు 'తల్లి నుంచి సంక్రమించిన విద్య' అనేవారు. ఆ రోజుల్లోనే నేను వాళ్ళింటికి వెళ్ళి, పాటలు వింటూ, రాధాకృష్ణలాగే పెదవులు కదుపుతూ పాట నేర్చుకోడానికి ప్రయత్నం చేసేదాన్ని. రాధాకృష్ణకి ఈ తల్లీ ఎక్కువ కాలం దక్కలేదు. ఆరేళ్ళుండగా జయంతమ్మకి గుండె పోటు వచ్చి, లోకాన్ని విడిచి వెళ్ళిపోయింది. తల్లిగా స్థన్యం ఇవ్వలేకపోయినా తన గాన మకరందాన్ని పిల్లవాడికి ఉగ్గుపాలతో పోసింది జయంతమ్మ. ఆవిడకున్న బలహీనపు గుండె వల్ల పిల్లలు పుడితే ప్రమాదం అన్నారు డాక్టర్లు. అదే ప్రేరణ ఈ పెళ్ళి చేసుకోవడానికి. రాధాకృష్ణ పేరున పొలాన్నంతా రాసిచ్చి, చివరి కోరికగా పిల్ల వాడిని డాక్టరు చేయమని చెప్పి, తుది శ్వాస విడిచింది.

మేము చదివే ట్యుటోరియల్ కాలేజీలో మొదటినుంచే అవసరమైన సబ్జక్ట్సు ఎంచుకునే సౌలభ్యం వుండేది. నాకూ నాన్న గారిలా డాక్టరవాలని వుండడంతో మా సబ్జక్ట్సు ఒకటే అయ్యాయి. నాకన్నా రాధాకృష్ణ రెండేళ్ళు చిన్న. ఎక్సెంప్షన్ వల్ల నాతోనే మెట్రిక్ పాసయ్యాడు.

స్కూల్‌కి గంట ముందు బయలుదేరేదాన్ని. రాధాకృష్ణ తయారుగా వుండే వాడు. ఇద్దరం సిలోన్‌లో సైగల్ పాటవిని, తర్వాత స్కూలికి నడిచి వెళ్ళేవాళ్ళం. అక్కడ రావిచెట్టు తిన్నెమీద కూర్చుని విన్న సైగల్ పాట ప్రాక్టీసుచేసేవాళ్ళం. హిందీ సినిమా పాటలతోనే బాల్యం నుంచి కౌమార్యంలోకి అడుగు పెట్టాం. ఎన్ని పాటలు పాడుకునే వాళ్ళమో. ఎన్ని తగాదాలు పడే వాళ్ళమో. ప్రీ మెట్రిక్‌లో వుండగా హిందీ పరీక్షలకి కట్టి రాష్ట్రభాష స్టేట్ ఫస్ట్‌గా పాసయ్యాను. క్లాసులో అన్ని సబ్జక్ట్సులోనూ నేను ఫస్టు, రాధాకృష్ణ సెకండూ, ఒక్క పాటల పోటీల్లోనే రాధాకృష్ణని గెలవలేకపోయేదాన్ని, కొత్తగా వచ్చిన హిందీ పరిజ్ఞానంతో ఒకరోజు తలత్‌మెహమూద్ పాట గురించి వాదనేసుకున్నా.

'మొహొబత్ హీనా జోసమఝే, ఓ జాలిమ్, ప్యార్ క్యా జానే' అనే పాట

''మొహబ్బత్ అన్నా ప్యార్ అన్నా ఒకటే కదా! ఏమిటీ పాటర్థం?'' అన్నా.

రాధాకృష్ణకీ అర్థం కాలే ''పోనీలే! ఏదో ఒకటి! '' అన్నాడు.

''అదే నేననేదీనూ, రెండూ ఒకటే కదా, అని'' రెట్టించాను.

అయోమయంగా నావంక చూసి, ''అబ్బ వసంతా, నాకు తెలియనివి అడక్కు'' అన్నాడు.

''ఓడిపోయావు, ఓడిపోయావు'' అన్నా పకపకా నవ్వి.

''ప్యార్‌లోనూ, మొహబ్బత్‌లోనూ గెలుపు, ఓటములుండవు, వసంతా'' అన్నాడు. ఏదో తెలియని గంభీరత మా మధ్యన చోటు చేసుకుంది.

స్కూల్ నుండి రాగానే, బట్టలు మార్చుకుని, టిఫిన్ తినేసి, రాధాకృష్ణ ఇంటికి పరిగెట్టేదాన్ని.

''ఇప్పుడే కదే వచ్చావు, అప్పుడే కృష్ణ దగ్గరకి మళ్ళీ పరిగెట్టాలా?'' అనేవారు నాన్న. స్వరంలో మా స్నేహాన్ని ఆమోదించే ధ్వని వుండేది. మందలింపు వుండేది కాదు. రాత్రి పదయ్యాక భాయాగీత్ విన్నాక, కృష్ణ తోడొచ్చి, ఇంటికి దిగబెట్టేవాడు. భోజనం తరుచు వాళ్ళింట్లోనే తినేసేదాన్ని. ఒకోసారి కృష్ణ మా యింటికి రికార్డులు పట్టుకుని వచ్చేవాడు. వీణ, వయొలిన్, ఫ్లూటూ, కర్ణాటక సంగీతం బాణీల్లోవి, వినేవాళ్ళం. అన్నింట్లోకీ వీణంటే నాకు చాలా యిష్టంగా వుండేది.

అమ్మ పాడేది. వీణ కూడా వాయించేది. తన పెళ్ళిలో తనే కచేరీ చేసిందట. నాన్న తరుచూ, ''ఇందూ వసంతారాగాన్ని మరోసారి ఆలపించు'' అనడం నాకు జ్ఞాపకమే. అమ్మ అప్పుడు అన్ని పనులూ వదిలేసి, చాప మీద కూర్చుని రాగాన్ని ఎత్తుకునేది. ఒకోసారి వీణ వాయించేది. నాన్న వాలుకుర్చీలో చేరబడి, చేతులు తలక్రింద పెట్టుకుని, కళ్ళు మూసుకుని తన్మయులై వినేవారు. నా మూడో యేట అమ్మని ఏవేవో చేసి బయటకు తీసికెళ్ళిపోయారు. నేను తెలిసీ తెలియని జ్ఞానంతో అత్తయ్య కొడుకు కళ్యాణ్‌తో పెరట్లో ఆడుకోడానికి వెళ్ళిపోయాను. తర్వాత అమ్మ చాలా రోజులు ఇంట్లోకనిపించలేదు. ఒక నాడు నాన్న వాలుకుర్చీలో కూర్చోగా చూసి, నేను గబగబా చాప పరిచి, అమ్మ లాగే మఠం వేసుక్కూర్చుని, 'వసంత రాగాన్ని, వసంతరాగాన్ని' అని కిలకిల నవ్వాను. నాన్న కన్నీళ్ళు తుడుచుకుని, ''ఏదీ, ఆలపించు'' అన్నారు. మోర ఎత్తి పై స్థాయిలో 'సా,సా' అని పాడాను. ఆ పైశ్రుతి అప్పటి నుంచే అలవాటయింది. కృష్ణతో సమస్థాయిలో అందుకే పాడగలిగేదాన్ని. బళ్ళో వేసినప్పుడు నాన్న 'వసంత' అని పేరు చెప్తుంటే, 'వసంతరాగాన్ని, వసంతరాగాన్ని' అన్నాను. నాన్న నవ్వి, 'అలాగే' అని, 'వసంత రాగిణి' అని పేరు నమోదు చేసారు.

నాన్న దిగులుగా వాలుకుర్చీలో కూర్చోగానే, నా పసి మనసుతో ఏదో అర్థం చేసుకుని, వీణ ఒడిలోకి తీసుకుని వాయించే ప్రయత్నం చేసేదాన్ని మెట్లూ, తీగలూ ఒకేసారి అందేవి కావు. నాన్న ఇది చూసి, బొబ్బిలి వెళ్ళి చిన్న వీణ కొని తెచ్చారు. పక్క వీధిలో సంగీతం టీచరుని వాయించడం నేర్పమని నియమించారు. పెద్దగా నైపుణ్యం లేకపోయినా, కృతులు వాయించడం వరకూ నేర్చుకున్నాను.

స్కూల్ యాన్యుయల్ డే ఫంక్షన్ స్టూడెంట్సుమే పెద్ద యెత్తున చేసుకున్నాం. ప్రిన్స్‌పల్ గారికి దండలూ అవీ వేసి సన్మానించాం.

''ఏదర్రా! పాటలేవీ?'' అన్నారాయన. అంతా నన్నూ, కృష్ణ నీ ముందుకి తీసారు.

'సరిగమపదనిసానిదపమగరిస, ఛేడ్ సఖీసర్‌గమ్, తూ...ఛేడ్ సఖీ సర్‌గమ్' అని గొంతులు శ్రుతికలవగా, ఒకే స్థాయిలో పాడాం. మాకా పాటంటే విపరీతమైన యిష్టం. రాధాకృష్ణ లతా మంగేష్కర్ గొంతుని అనుకరిస్తే, నేను అచ్చం తనని అనుకరించేదాన్ని.

మెట్రిక్ అయిపోయాక, సెలవుల్లో రాధాకృష్ణ, నేనూ చదువుల గురించి మాట్లాడుకున్నాం.


''కృష్ణా! సంగీత విద్వాంసుడివవుతావా, డాక్టరువా?'' అనడిగాను.

''ఇన్నేళ్ళూ సంగీతానికే ప్రాముఖ్యతనిచ్చాను వసంతా. కాని జయంతమ్మ కోరిక ప్రకారం డాక్టరవాలి. నాన్నగారు, అత్తయ్యా వాళ్ళ దగ్గర కాకినాడలో వుండి చదువుకోమంటున్నారు. హార్ట్‌స్పెషలైజేషన్ చేస్తాను. హాస్పిటల్ కట్టి 'జయ్‌జయ్‌వంతి' అని పేరు పెడతాను'' అన్నాడు రాధాకృష్ణ.

''పెళ్ళి చేసుకుని కూతురికి ఆ పేరు పెట్టు. హాస్పిటల్ కెందుకూ.'' అన్నాను. అప్పుడు రాధాకృష్ణ నా వంక చూసిన చూపు నా రెండేళ్ళ పెద్దరికం అర్థం చేసుకోలేకపోయింది.

తర్వాత రాధాకృష్ణ మురళి తీసుకుని వాయించాడు. ఆ రోజు మురళీనాదం ఒక ఆర్తితో నిండిపోయింది. నేను వింటూ వుండిపోయాను.

మా దార్లు వేరయ్యాయి. రాధాకృష్ణ వెళ్ళిపోయాక నాలో కలిగిన వెల్తి నెవరూ పూడ్చలేకపోయారు. పాడటం మానేసాను. అప్పుడప్పుడు వీణని తీసి, పలికించేదాన్ని. 'టింగ్, టింగ్' అని ఏవో శబ్దాలొచ్చేవి. మాధుర్యం ఉండేది కాదు. నాన్న అటుగా వెళ్తూ, ఆగి, మౌనంగా నా వంక చూసి వెళ్ళిపోయేవారు. మెడిసిన్‌లో సీటు



## కనుమరుగైన అలనాటి స్టూడియో

*1964* జూన్ ఒకటవ తేదీన హైదరాబాద్‌లో జహనుమా స్టూడియో నిర్మాణానికి ఆనాటి ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి శంకుస్థాపన చేశారు. ఇరవై రెండు ఎకరాల విస్తీర్ణంలో సదరన్ మూవిటోన్ లిమిటెడ్ సంస్థ ఈ స్టూడియోను నిర్మించింది. ఈ స్టూడియోను ఆతరువాత కాలంలో సదరన్ మూవిటోన్ అనీ, అజంతా స్టూడియో అని కూడా పిలిచేవారు. అయితే ఈ స్టూడియో డెబ్బయిల్లోనే మూతపడింది. అరవైల ద్వితీయార్థంలో రహస్యం సినిమాకోసం ఈ స్టూడియోను నిర్మాత శంకరరెడ్డి లీజుకు తీసుకున్నారు. అప్పట్లో ఈ స్టూడియో పేరు లలితా శివజ్యోతి స్టూడియోస్.

వచ్చింది. ఆ చదువు ఒక నదీ ప్రవాహం. అందులోపడి కొట్టుకు పోవడమే. క్షణం తీరి కుండేది కాదు.

డాక్టరు పట్టా అందుకున్నాక కళ్యాణ్‌తో వివాహం నిశ్చయించారు నాన్న. కళ్యాణ్‌కి నేనంటే విపరీతమైన అభిమానం. దాన్ని ప్రేమని అనగలమో లేదో నాకు తెలిసేది కాదు. ఎల్లవేళలా నా అవసరాలు కనిపెడుతూ, అత్యంత సన్నిహితంగా మసలేవాడు. వ్యవసాయం పనులు చూసుకోడానికి గ్రామం వెళ్ళినా, మిగతా సమయం మా వద్దే వుండేవాడు. నాకు పెళ్లయిన తేడా తెలిసేది కాదు. చిన్న నాటి స్నేహబంధమే కొనసాగినట్లనిపించేది. నాన్నగారి క్లినిక్ నడపడానికి సాయపడుతూ వుండే దాన్ని, పదేళ్ళు మా కాపురం ఏ ఒడిదుడుకులూ లేకుండా సాగింది. పిల్లలు కలుగలేదు.

పంటలు డబ్బు తీసుకుని వస్తూ కారు యాక్సిడెంటయి, కళ్యాణ్ ఈ లోకం వదిలి వెళ్ళిపోయాడు. నా లోకంలో లేని కారణాన నాకు లోటు తెలియలేదు. నాన్న ప్రాక్టీసులో సాయపడుతూ ఆయన నిర్వర్తించే విధులని జాగ్రత్తగా గమనిస్తూ, డాక్టర్ అన్న పదానికి సరైన నిర్వచనం ఇవ్వడానికి ప్రయత్నించేదాన్ని.

క్లినిక్‌లో వుండగా ఒక రోజు నాన్న ఉన్నట్లుండి. ''రాధాకృష్ణ సంగతేమైనా తెలుసా, వసంత రాగిణీ?'' అన్నారు. ఆయన నన్నెప్పుడూ పూర్తి పేరుతో పిలిచేవారు.

''లేదు నాన్నా, మెడిసిన్‌కి చాలా సమయం వెచ్చించాల్సి వుంటుంది. ఇది నాకు అనుభవం నేర్పింది. జనరల్ మెడిసిన్ చదివిన నాకే ఇలా అనిపిస్తే, స్పెషలైజేషన్‌కి కృష్ణ ఎన్ని శ్రమలు పడాల్సి వచ్చిందో'' అన్నాను.

''నీతో ఏం కాంటాక్ట్ లేదా? మీరిద్దరూ చాలా స్నేహంగా వుండేవారుగా'' అన్నారు నాన్న నిర్మల వదనంతో.

''మా సాన్నిహిత్యం పాటలకే పరిమితమయ్యింది నాన్నా. అదే మా లోకమూ, అనుబంధమూనూ. దూరం ఏర్పడడంతో అదిసమసిపోయింది'' అన్నాను నిర్లిప్తంగా.

''లేదు తల్లీ! అటువంటి స్నేహానుబంధం సమసిపోదు. పెంపొంది ఎక్కడో కలుస్తుంది'' అన్నారు నాన్న.

ఇంతలో పేషంట్లు రావడం మొదలయి, కేసుల్లో లీనమయిపోయాము.

చెప్పాపెట్టకుండా ఒక రాత్రి నాన్న నిద్రలో ప్రాణాలొదిలేసారు. జీవితం మీద వున్న కాస్త మమకారం నాలో హరించుకుపోయింది. నిర్లిప్తత ఇంకా హెచ్చయి, ఏదో చేయాలి కాబట్టి, క్లినిక్ నడిపేదాన్ని. నాన్న దగ్గరకొచ్చే పేషంట్లు ఆయన కలవాటు పడి, నాకు ఎక్కువగా స్పందించేవారు కాదు. రానురానూ, పేషంట్లు రాక సన్నగిల్లి, క్లినిక్ మూసేసాను. అప్పుడు వచ్చింది మనీషానాయుడు నా దగ్గరికి. హాస్పిటల్ కడుతున్నాం, ఎడ్మినిస్ట్రేటర్‌గా వుండమని అడిగింది. వైద్యవృత్తిలో వున్న సేవాభావం పైకొచ్చి, సరేనన్నాను. అప్పటి నుండీ, హాస్పిటల్ బాగోగులు చూస్తూ పనిలో నిమగ్నమైపోయాను. అయిదేళ్ళయింది. హాస్పిటల్ బాగా వృద్ధిలోకి వచ్చింది. ఎన్నో స్పెషల్ వింగ్స్ కట్టాం. హార్ట్‌కేర్ కోసం పూర్తి బిల్డింగ్ కట్టడానికి పూనుకున్నాం. నాన్నకున్న పేరు ప్రతిష్ఠలవల్ల నిధులు నా పరంగా బాగానే సమకూరి, పన్లు చకచకా సాగిపోతున్నాయి.

'సరగమపదని' మ్యూజికల్ నైట్ అయిపోయిన మరుసటి రోజు మనీషా నా ఛేంబర్‌లోకి వచ్చింది.

''మేడం మన హాస్పిటల్‌కి స్వీడన్ నుంచి డాక్టరొకరు విజిట్‌కొచ్చారు. మేడం. స్పెషల్ హార్ట్‌కేర్ ఎక్విప్‌మెంట్ మనసెంటర్‌కి డొనేట్ చేస్తున్నారు. నిన్న మన ప్రోగ్రాంలో ఆడియన్సులో కూర్చున్నారు. ఎంతో ఎంజాయ్ చేసారు మేడం'' అంది మనీషా.

''బాగుంది ఆయన వసతి ఏర్పాట్లు సరిగా చేయి. ఫారినర్స్‌కి వింగ్ కట్టించాం కదా, అక్కడ బసచేయించు'' అన్నాను.

''అల్రెడీ చేసేసాను మేడం. ఆయన నిన్న ఒక రిక్వెస్టు చేసారు మేడం'' మనీషా ఆగింది. ఏమిటన్నట్లు చూసాను.

''వీణ ఒకటి కావాలన్నారు మేడం తీరికసమయంలో వాయించుకుంటారట. సంగీతప్రియులు మేడం. నాకు తెలిసినంతమటుకూ, మీ దగ్గరే వీణ వుంది. అదిస్పేర్ చేయగలరేమోననీ'' మనీషా కళ్ళు దించుకుంది. కొన్నిటిలో మనీషా నా వద్ద చనువు ప్రదర్శించదు.

''ఆ వీణ మా అమ్మది. పదిలంగా కాపాడుకుంటాను. అందరి చేతుల్లోనూ పడితే శ్రుతి మారిపోతుంది'' అన్నాను కాస్త కటువుగా.

''ఆయన అందరిలా కాదు మేడం. హార్ట్ సర్జరీ ఎంత బాగా చేస్తారో, అంత బాగానూ వీణ వాయించగలరు. శ్రుతి పోదు మేడం'' అంది మనీషా దృఢంగా.

''ఎలా చెప్పగలవు?'' అన్నాను మెత్తబడుతూ.

నా స్వరం లోని సడలింపు గమనించి, ''అవి హార్ట్ స్ట్రింగ్స్ ఇవి వీణ స్ట్రింగ్స్, రెండూ ట్యూన్ చేయగలరని నా నమ్మకం'' అంది.

నవ్వి, ''సరే, సరే ఆయన వసతి ఏర్పాట్లు చూడు. హాస్పిటల్ నుంచి సాయంత్రం ఎవరినైనా పంపు. వీణని తీసుంచుతాను'' అన్నాను.

మర్నాడుదయం రౌండ్స్ మీదుండగా, కొత్త బిల్డింగ్ నుంచి వీణానాదం వినిపించింది. అమ్మ వీణ! తిరిగి మ్రోగుతోంది. నా ప్రమేయం లేకుండానే కాళ్ళు ఆ నాదం దిక్కుగా నడిచాయి. గెస్ట్ రూం తలుపులు తీసే వున్నాయి. లోనికి నడిచాను.

''వచ్చావా, వసంతా!'' అన్నాడు, వీణ మీటుతున్న రాధాకృష్ణ, నిశ్చలంగా నిలబడిపోయాను. సంతోషమో, సంభ్రమమో తెలియని మానసిక స్థితి.

ఎందుకు వూహించలేకపోయాను? వీణనివ్వమని అడిగే అధికారం, హక్కూ రాధాకృష్ణకి తప్ప




# అన్ని భాషల్లోనూ అఖండ ఆదరణ

**1953**లో అశోకా పిక్చర్స్ అనే సంస్థ నా చెల్లెలు అనే చిత్రం తీసింది. దీని ఆధారంగానే ఎల్వీ ప్రసాద్ హిందీలో ఛోటీ బహెన్ చిత్రం తీశారు. ఆ సినిమా ఆధారంగానే తెలుగులో మళ్ళీ ఆడపడుచు (1967) చిత్రం వచ్చింది. నా చెల్లెలు చిత్రంలో అమర్‌నాథ్, సూర్యకళ చేసిన పాత్రలను నందమూరి, చంద్రకళ చేశారు. దర్శకుడు కె. హేమాంబరధర రావు. ఆయనే ఆ తరువాత ఇదే చిత్రాన్ని ఒరియాలో తీశారు. విశేషం ఏమిటంటే ఇన్ని సార్లు ఇన్ని భాషల్లో వచ్చినా ఈ సినిమా అన్నిచోట్లా అఖండ విజయం సాధించింది.







# ఆ ఇద్దరు అమ్మాయిలు కన్నడ పిల్లలు!

*1969*లో పుట్టన్న దర్శకత్వంలో కన్నడంలో కప్పూ బెళపూ అనే సినిమా విడుదలయ్యింది. ఆయన దర్శకత్వంలోనే ఆ సినిమాను తెలుగు, తమిళాల్లో ఒకేసారి తీశారు ప్రొడ్యూసర్స్ కంబైన్స్‌వారు. రెంటిలోనూ వాణిశ్రీనే నాయిక. తెలుగులో అక్కినేని, తమిళంలో శివాజీ చేశారు. తమిళంలో ఈ సినిమా పేరు కరులిన కరే. తెలుగులో ఇద్దరు అమ్మాయిలు. రెంటిలోనూ ఎస్.వి.రంగారావు కూడా వున్నారు. తెలుగు వెర్షన్‌కు ముందు పూజకొద్దీ పురుషుడు అని పేరు పెట్టి తరువాత ఇద్దరు అమ్మాయిలుగా మార్చారు. కన్నడంలో ఈ సినిమాలో నాయిక కల్పన.

ఎవరి కుంటుంది?

''వస్తున్నానని చెప్పలేదేం?'' అన్నాను. అతి మామూలుగా. ఇరవైఅయిదేళ్ళ దూరం, దూరంగా పారిపోయింది.

''పాడడం మానేసావుట?'' అన్నాడు రాధాకృష్ణ, చిన్నప్పుడడిగినట్లు.

''ఎవరితో పాడను కృష్ణా?'' అన్నాను.

''ఇప్పుడు పాడు నాతో ఏం పాడుకుందామా? ''

''పాడలేను కృష్ణా. స్వరం పలకదు''

''నిన్న మ్యూజికల్ నైట్‌లో 'ఆజారే' కి ఫస్ట్ ప్రైజిచ్చావుగా. ఆ పాట పాడు.

''ఆ పాట నీదీ. ప్రైజూ నీదే. వీణ వాయించడం ఎప్పుడు నేర్చుకున్నావు? మురళేదీ?''

''మురళిని నేను వీడను. నన్ను మురళి వీడదు. కాకినాడలో మెడిసిన్ చదువుతున్నప్పుడు వీణ నేర్చుకోవాలనిపించింది. నువ్వు గుర్తొచ్చేదానివి. వీణ పలికిస్తున్నంతసేపూ నీతో వున్న అనుభూతి కలిగేది. మురళిని స్వీడన్ తీసుకెళ్ళగలిగాను కానీ, వీణని తీసుకెళ్ళలేకపోయాను. నిన్న మ్యూజికల్ నైట్‌లో నువ్వు స్టేజి మీద కనబడేసరికి, డాక్టర్ మనీషాని వీణ తెప్పించమని అడిగాను. రా వీణ వాయించు.''

''నాన్న పోయాక వీణ పలకడం మానేసింది కృష్ణా'' అన్నాను నిర్లిప్తంగా.

''చిన్న వీణ వాయిస్తున్నప్పుడు డాక్టరు నాన్నగారేమనేవారు, వసంతా?''

''వసంతంలో కోయిల కూ, కూ, అన్నట్లు పలికించమనేవారు''

''నువ్వేం చేసేదానివి?''

''కూహ్,! కూహ్! అని తంత్రులు లాగి శబ్దం పొడిగించేదాన్ని''

''అదెలా నేర్చుకున్నావు?''

''చిట్టి బాబుగారి కచేరీకి నాన్న ప్రత్యేకంగా నన్ను మద్రాసు తీసుకెళ్ళారు. రెండో వరసలో కూర్చుంటే ఆయన వాయించడం సరిగా కనిపించలేదు. అప్పుడు నాన్న వింగ్స్‌లోకి తీసుకెళ్ళారు. చిట్టిబాబు గారి వేళ్ళ కదలిక సామీప్యం నుంచి చూసాను. తర్వాత ఇంటికొచ్చి, ప్రాక్టీసు చేసేదాన్ని. అలా పట్టుబడింది.''

''ఇప్పుడూ అలాగే వాయించు'' రాధాకృష్ణ పక్కనే వున్న మురళి నందుకుని పెదవుల కానించుకున్నాడు.

కూ..హ్! కూ..హ్ అని మురళి లోంచి శబ్దం వెలువడింది. అప్రయత్నంగా నా చేతులు వీణ తంత్రులని లాగి అదే శబ్దం పలికించాయి. మురళిని వూదుతూ రాగం పలికిస్తూనే వున్నాడు రాధాకృష్ణ. నా చేతులు వీణమీద అటూ ఇటూ పరిగెడుతూనే వున్నాయి. ఒకే నాదం, ఒకే రాగం ఏది మురళో, ఏదీ వీణో తెలయని సమైక్యత. జగమంతా స్తంభించిపోయిన అనుభూతి. ఎప్పుడొచ్చిందో, మనీషా మంత్రముగ్ధురాలై నిలబడి వుంది. ఇద్దరం ప్రశాంతంగా వాయిద్యాలు వదిలి, ఆమెని చూసి చిరునవ్వునవ్వాం.

''డాక్టర్స్ ఏమిటీ ప్రతిభ'' అంది సంభ్రమంగా.

''మాది చిన్ననాటి స్నేహనుబంధం డాక్టర్ మనీషా, పాటలతోనే పెరిగాం ఏదీ! వసంతా, మనీషాతో కలిసి 'ఛేడ్ సఖీ సర్‌గమ్' పాడు'' అన్నాడు రాధాకృష్ణ.

''నువ్వూ పాడు'' అన్నాను.

''ఇప్పుడు నా గొంతు లతామంగేష్కర్‌ది కాదుగా'' అన్నాడు నవ్వుతూ.

సరిగమపదనిసానిదపమగరిస, ఛేడ్ సఖీసర్‌గమ్, తూ'' అని ఎత్తుకున్నాను. మనీషా స్వరం కలిపింది. ఎన్నో పాటలు పాడుకున్నాం. రాధాకృష్ణ తలత్ మెహమూద్ వాయిస్‌లో 'మొహొబ్బత్ హీన జు సమఝే, ఓ జాలిమ్ ప్యార్ క్యాజానే' అని అత్యంత మాధుర్యంతో పాడాడు. నా హృదయ వీణ తంత్రులు మీటినట్లయింది. మనీషా కాసేపయాక మమ్మల్నలా వదిలేసి వెళ్ళి పోయింది. రాగాలు పలికించుకుంటూనే వున్నాం, నేనూ రాధాకృష్ణా.

''స్వీడన్ లో నేను కట్టిన హాస్పిటల్ 'జయ్ జయ్ వంతి'' నడపడానికి ఎ్స్తావా వసంతా?'' అన్నాడు రాధాకృష్ణ.

వాలుకుర్చీలో కూర్చున్న నాన్న

''వెళ్ళు, వసంతరాగిణీ'' అన్నారు.

*

